నేరెళ్ల లక్ష్మణ్ (ఫైల్)

గోగుల భాస్కర్‌రెడ్డి (ఫైల్)

ఇద్దరు యువ రైతుల ఆత్మహత్య

- పంటల సాగుతో 4-6 లక్షల అప్పులు
- భరోసా లేక.. పెట్టుబడి రాక మనస్తాపం
- నిర్మల్, వరంగల్‌లో ఇద్దరి బలవన్మరణం

కుంటాల/దుగ్గొండి, నవంబర్ 14: సాగు కోసం పెట్టిన పెట్టుబడిరాక, మరోపక్క రైతుభరోసా అందక అప్పులు ఎలా తీర్చాలనే మనస్తాపంతో ఇద్దరు యువ రైతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిర్మల్, వరంగల్ జిల్లాల్లో చోటు చేసుకున్నాయి. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని సూర్యాపూర్‌కు చెందిన రైతు నేరెల్ల లక్ష్మణ్(38) తనకున్న రెండెకరాల్లో సోయా వేశాడు. రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. అధిక వర్షాలతో వాగు ఉప్పొంగి పంట పూర్తిగా కొట్టుకుపోయి నష్టం వాటిల్లింది. దీనికితోడు ఐదేండ్ల నుంచి అక్కడక్కడ పదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి, సోయా సాగు చేస్తున్నాడు. రూ.4 లక్షల వరకు అప్పులు అయ్యాయి. పెట్టిన పెట్టుబడి రాకపోవడం, రైతు భరోసా లేకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపం చెందాడు. బుధవారం రాత్రి పనికి వెళ్తున్నానని చెప్పిన లక్ష్మణ్ చేను వద్దనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష్మణ్‌కు భార్య నీలాబాయి, కూతురు శైలజ, కుమారులు సత్యం, సాయి కిరణ్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై భాస్కరాచారి తెలిపారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన గోగుల భాస్కర్‌రెడ్డి(38) తనకున్న 4 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసుకుంటున్నాడు. దిగుబడి రాక రూ. 6 లక్షల వరకు అప్పులయ్యాయి. ఈ విషయమై ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండేవి. అప్పు తీరకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన భాస్కర్‌రెడ్డి ఈ నెల 2న ఇంట్లో గడ్డిమందు తాగగా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

రేవంత్‌ది 'ఎఫ్-3' ఫార్ములా!

మొదటిపేజీ తరువాయి...

సోదరుడు జగదీశ్‌రెడ్డికి స్వచ్ఛబయో, అదానీకి కాంట్రాక్టులు ఇవ్వడం ఇలా రేవంత్ తన 11 నెలల పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆశ్రిత పక్షపాతంపై మాట్లాడే రాహుల్‌గాంధీ రేవంత్‌రెడ్డి కొల్లగొడుతున్న సంపదపై మాట్లాడాలని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్‌ను, కేటీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో 9 నెలలుగా రైతులు ఆందోళన చేస్తుంటే వారి గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత క్రిశాంక్, పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి

రేవంత్‌కు కేటీఆర్ ఫోబియా

అల్లుడి బండారం బయటపెట్టిన కేటీఆర్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టార్గెట్ చేశారని క్రిశాంక్, విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. రేవంత్‌కు కేసీఆర్, కేటీఆర్ ఫోబియా పట్టుకున్నదని ఎద్దేవా చేశారు. కొడంగల్ అసలు కుట్రదారుడు సీఎం రేవంత్‌రెడ్డేనని, కేటీఆర్ ఎంతమాత్రమూ కాదని పేర్కొన్నారు. కొడంగల్‌లో జరుగుతున్న దుర్మార్గం బయటి ప్రపంచానికి తెలియకూడదని ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారని విమర్శించారు. రేవంత్ సర్కార్ చేస్తున్న అక్రమాలను ఎప్పటికప్పుడు బయటపెడుతున్నందు వల్లే కేటీఆర్‌ను కేసుల్లో ఇరికించి జైలుకు పంపాలని టార్గెట్ చేశారని ఆరోపించారు. పట్నం నరేందర్‌రెడ్డి అఫిడవిట్ అందుకు నిదర్శనమని తెలిపారు. రేవంత్ తన అల్లుడి కోసం రైతుల భూములను కాజేస్తున్నారని కేటీఆర్ ఆధారాలతో బయటపెట్టారని, అందుకు ప్రతీకారంగా కేటీఆర్‌ను కేసులో ఇరికించాలని పథకం వేశారని, అసలు కుట్రదారు రేవంత్‌రెడ్డేనని పేర్కొన్నారు. సీఎం సోదరుడు అన్న కారణంగా తిరుపతిరెడ్డికి కలెక్టర్ స్వాగతం పలికారని, రైతుల పక్షాన నిలబడిన మాజీ ఎమ్మెల్యేను మాత్రం జైలుకు పంపారని అన్నారు.

ఫిర్యాదులను జీర్ణించుకోలేకే..

స్వచ్ఛబయో, అమృత్‌టెండర్ల అక్రమాలపై కేంద్రానికి ఫిర్యాదు చేయడాన్ని జీర్ణించుకోలేకే కేటీఆర్‌పై కుట్ర చేశారని క్రిశాంక్, విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కొడంగల్ ఫార్మా క్లస్టర్‌లో రేవంత్‌రెడ్డి అల్లుడు గొలుగూరి సత్యనారాయణరెడ్డికి చెందిన మ్యాక్స్‌బీన్ ఫార్మా కంపెనీ ఉందని ఆధారాలతో కేటీఆర్ వెల్లడించారని పేర్కొన్నారు. మ్యాక్స్‌బీన్ ఫార్మా కంపెనీ, అన్నం శరత్‌కు చెందిన ఎస్వీఎస్ ఫెసిలిటీ కంపెనీల లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు బయటపడ్డాయని వివరించారు. సత్యనారాయణరెడ్డికి మ్యాక్స్‌బీన్ ఫార్మాలో వాటా ఉన్నదని, 2020లో ఏర్పాటైన ఈ కంపెనీలో సత్యనారాయణరెడ్డికి 16.06 శాతం వాటా (16.92 లక్షల షేర్లు) ఉన్నదని, మ్యాక్స్‌బీన్ ఫార్మాలో అన్నం శరత్‌కు 1.03 శాతం వాటా (1.08 లక్షల షేర్లు) ఉందని పేర్కొన్నారు. అలాగే, ఎస్వీఎస్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కూడా అన్నం శరత్‌దేనని, మ్యాక్స్‌బీన్ ఫార్మాలో దీనికి 20,33,333 షేర్లు, 19.3 శాతం వాటా ఉన్నదని వివరించారు. మెడికవర్ హాస్పిటల్స్‌లో శరత్‌కు 5,08,808 షేర్లు ఉన్నాయని పేర్కొన్నారు. అల్లుడి కంపెనీ బాగోతాన్ని బయటపెట్టిన కేటీఆర్‌పై కొండగల్ ఉదంతాన్ని రుద్దేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని వారు మండిపడ్డారు. కొడంగల్ రైతుల మీద జరిగిన దమనకాండ జాతీయస్థాయిలో చర్చనీయాంశం కావడంతో కేటీఆర్ కుట్ర చేశారంటూ డైవర్షన్ డ్రామాకు తెరలేపారని విమర్శించారు. అమృత్ పథకం, శోధ, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అవినీతి, సుంకిశాల మేఘా కంపెనీ బాగోతం, మూసీ బాధితులు, రైతులను మోసం చేయడం వంటి అనేక అంశాలపై రేవంత్ సర్కార్‌ను కేటీఆర్ నిద్రపోనివ్వకుండా చేస్తున్నారని, కుట్రకు ఇదే అసలు కారణమని పేర్కొన్నారు. ఫార్ములా ఈ-రేస్‌లో ఏం జరిగిందో స్వయంగా కేటీఆరే వెల్లడించడంతో ఏం చేయలో తోచక కొడంగల్ కుట్ర నాటకాన్ని రక్తికట్టిస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా ఆఖరికి జైలులో వేసినా తెలంగాణ ప్రజల పక్షాన కొట్లాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

ఆశ పడ్డం.. గోస పడుతున్నం

- ఈ సర్కారు మీద మాకు నమ్మకం లేదు
- ప్రైవేట్‌కు వడ్లు అమ్ముకుంటున్నం
- ఎర్రబెల్లి దయాకర్‌రావు ముందు గోడు వెళ్లబోసుకున్న మొండ్రాయి రైతులు

కొడకండ్ల, నవంబర్ 14: 'కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మి ఆశ పడ్డం.. ఇప్పుడు గోస పడుతున్నం' అంటూ రైతులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. గురువారం బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామానికి వెళ్తుండగా ఎర్రబెల్లి వాహనాన్ని ఆపి ఆయనతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాము పండించిన పంటకు బోనస్ ఇవ్వకపోగా, కనీసం మద్దతు ధర కూడా ఇస్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'రైతుబంధు, రుణమాఫీ ఎగ్గొట్టిండ్రు.. బోనస్ ఎప్పుడిస్తరో తెల్వదు.. అసలు వడ్లే సరిగా కొంటలేరు.. అందుకే మేము ప్రైవేట్‌ల అమ్ముకుంటున్నం' అని రైతులు వాపోయారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి నెల రోజులైనా ధాన్యం కొంటలేరని, అందుకే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంలో తడిసిన గింజలను కూడా కొనుగోలు చేసి టైముకు పైసలు ఇచ్చేటోళ్లని, మొదట్లనే రైతుబంధు వేస్తే మా జేబులల్ల పైసలు ఉండేవని చెప్పుకొచ్చారు. అప్పటి రోజులే మంచిగుండెనని, తాము ఇంకా ఏదో ఆశకు పోయి ఇప్పుడు గోస పడుతున్నామని అనుముల అంజయ్య, పెరుమాండ్ల పరశురాములు, నలమాస మల్లయ్య, తదితర రైతులు ఎర్రబెల్లికి తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ రైతులకు అన్యాయం జరిగితే ఊరుకోమని, ప్రతి గింజా కొనేవరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.


జనగామ జిల్లా కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ప్రైవేట్‌కు అమ్ముకుంటున్నం

నాకున్న సొంత పొలంతోపాటు మరి కొంత కౌలుకు తీసుకుని 8 ఎకరాల్లో వరి పండించిన. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తదనుకున్నం కానీ, కొనకపాయే. వడ్లు ఆరబోసి ఇరవై రోజులైనా మాయిశ్చర్ వస్త లేదు, సరిగా ఎండలేదు అని చెప్తే 100 బస్తాలకు పైగా ప్రైవేట్‌ల అమ్ముకొచ్చినం. ఇంకా 150 బస్తాలకు పైగా ఇయ్యాల ప్రైవేట్‌కు పోతున్నం. బోనస్ వస్తది అంటే సన్న వడ్లు కూడా ఏసినం. అవికూడా ఇప్పుడు ప్రైవేట్‌కు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. మద్దతు ధర దక్కక, బోనస్ లేక ఇబ్బంది పడుతున్నం. రైతుబంధు లేదు.. ఏం లేదు.. అంతా ఉట్టిదే.

- అనుముల అంజయ్య, రైతు, మొండ్రాయి

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లి స్టేజీ వద్ద ఇండస్ట్రియల్ పార్కుకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్న బాధిత రైతులు, అఖిలపక్ష నాయకులు

ఇండస్ట్రియల్ పేరుతో మా భూములు లాక్కోవద్దు

- చౌటపల్లి స్టేజీ వద్ద 312 సర్వేనంబర్ బాధిత రైతుల ధర్నా

అక్కన్నపేట, నవంబర్ 14: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామ సర్వేనంబర్ 312లో ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు యత్నిస్తున్నది. దీంతో ఈ విషయమై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. తాము ఎన్నో ఏండ్లుగా సాగుచేసుకుంటున్న భూములను ఇండస్ట్రియల్ పార్కు పేరిట లాక్కోవద్దని బాధిత రైతులు గురువారం చౌటపల్లి స్టేజీ వద్ద ధర్నా నిర్వహించారు. రైతుల ధర్నాకు గ్రామ అఖిలపక్ష నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు ఇండస్ట్రియల్ పార్కు సర్వే పేరిట అత్యుత్సాహం చూపుతున్నారని, తమకు విషయం చెప్పకుండా సంతకాలు తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బెదిరింపులు, అక్రమాలకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇండ్లకు దగ్గరలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారుల తోపాటు స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు ఆలోచనను విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పత్తి వ్యాపారిని విచారిస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల పోలీసులు

క్వింటాకు 24 కిలోల తరుగు

- పత్తి కొనుగోలులో వ్యాపారి మోసం
- పోలీసులకు అప్పగించిన రైతులు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోపాలపూర్‌లో ఘటన

చిట్యాల, నవంబర్ 14: రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని మోసానికి పాల్పడుతున్న ఒక వ్యాపారిని రైతులు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని గోపాల్‌పూర్‌లో జరిగింది. నెల రోజులుగా గోపాల్‌పూర్‌లో ఒక ప్రైవేట్ వ్యాపారి పత్తి కొనుగోలు చేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నాడు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు వందలాది మంది రైతుల వద్ద పత్తి కొనుగోలు చేశాడు. కొనుగోలులో క్వింటాకు 24 కిలోల తరుగు తీస్తున్నాడు. గురువారం పత్తి కొనుగోలు చేస్తుండగా అనుమానం వచ్చిన రైతు మళ్లీ తూకం వేయగా క్వింటాకు 24 కిలోల తరుగు వచ్చింది. ఈ విషయాన్ని పలువురు రైతులకు తెలుపడంతో రవాణాకు సిద్ధంగా ఉన్న వాహనం గాలి తీసి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి అక్రమంగా పత్తి కొనుగోలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న వ్యాపారి అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై స్థానిక ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా రైతుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే దర్యాప్తు చేయనున్నట్టు చెప్పారు.

ఇది దళారుల ప్రభుత్వం

- ధాన్యం సరిగా కొనడం లేదు
- క్వింటాల్‌పై 400 నష్టపోతున్న రైతన్న
- కొనుగోళ్లలో వేగం పెంచండి
- మాజీ మంత్రి ఎమ్మెల్యే గంగుల డిమాండ్

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 14: ధాన్యం చివరి గింజ వరకు కొనుగోళ్లు ఉంటాయని ప్రభుత్వం చెప్తున్నదని, కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చెప్పారు. కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో ధాన్యం కొనుగోళ్ల విషయంలో ఎదురవుతున్న సమస్యలను గురువారం కలెక్టర్ పమేలా సత్పతి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ 'కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి చూస్తుంటే చాలా బాధగా ఉన్నది. గత నెలలో వరి కొనుగోళ్లు ప్రారంభించారు. దాదాపు 45 రోజులు గడుస్తున్నా ఇంకా మందకొడిగానే కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో 44వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో కొనుగోళ్లు చాలా వేగంగా జరిగాయి. అప్పట్లో కరీంనగర్ జిల్లాలో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులు రైతుల వద్ద మద్దతు ధర కంటే రూ.400 తక్కువకే కొనుగోలు చేస్తున్నారు. దీంతో అన్నదాతలు క్వింటాల్ ధాన్యంపై రూ.400 నష్టపోతున్నారు. ఇక సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించి ఇప్పుడు కూనారం సన్నాలు తీసుకోమని చెప్తున్నది. ప్రభుత్వ తీరు దళారులను ప్రోత్సహిస్తున్నట్టే ఉన్నది' అని పేర్కొన్నారు. ఇప్పటికైనా కొనుగోళ్లలో వేగం పెంచాలని కలెక్టర్‌ను కోరినట్టు గంగుల తెలిపారు. కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బుర్ర తిరుపతి గౌడ్, సంపత్‌రావు పాల్గొన్నారు.

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతితో మాట్లాడుతున్న గంగుల కమలాకర్

మాకు రుణమాఫీ ఎప్పుడైతది?

- మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్‌ను ప్రశ్నించిన మహిళా రైతు
- కొనుగోలు కేంద్రం ప్రారంభంలో నిలదీత

నెల్లికుదురు, నవంబర్ 14: 'సారూ.. మాకు రుణమాఫీ ఎప్పుడైతది' అని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్‌ను ఓ మహిళా రైతు ప్రశ్నించింది. ఈ ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రామన్నగూడెంలో చోటుచేసుకుంది. గ్రామంలో నెల్లికుదురు సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడి వెళ్తుండగా గ్రామానికి చెందిన ఆలకుంట్ల దర్గమ్మ ఎమ్మెల్యే వద్దకు వచ్చి 'సారూ.. మాకు ఇంతవరకు రుణమాఫీ కాలేదు.. ఇంకెప్పుడు అయితది' అని ప్రశ్నించింది. స్పందించిన ఎమ్మెల్యే డిసెంబర్ 31 వరకు ప్రతి ఒక్కరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ అవుతుందమ్మా అని జవాబిచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు.


రామన్నగూడెంలో రుణమాఫీపై ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న మహిళా రైతు దర్గమ్మ

ఆ ఆఫీసర్లను సతాయిద్దాం

- రాత్రిపూట ఫోన్లు చేసి లేపండి
- ఆఫీసులో కలవరు.. ఫోన్ చేస్తే ఎత్తరు
- పెండింగ్ బిల్లులపై సమాధానం చెప్పే వరకు అధికారులను నిద్రపోనివ్వొద్దు
- వైరల్ అవుతున్న విజయ డెయిరీ పాడి రైతు కాల్ రికార్డు

హైదరాబాద్, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): విజయ డెయిరీ అధికారుల నిర్లక్ష్య వైఖరి.. పాడి రైతుల ఆగ్రహానికి దారితీస్తున్నది. కనీస మర్యాద లేకుండా ప్రవర్తించటంపై మండిపడుతున్నారు. ఆఫీసుకు వెళ్లినా.. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఫైర్ అవుతున్నారు. ఇటీవల ఓ పాడి రైతు పాల బిల్లుల కోసం విజయ డెయిరీ ద్వితీయ శ్రేణి ఉన్నతాధికారికి చాలామార్లు ఫోన్లు చేసినా.. ఆ అధికారి లిఫ్ట్ చేయలేదు. దీంతో విసుగు చెందిన రైతు తన గోడును తోటి రైతులతో పంచుకున్నారు. ఇప్పుడీ కాల్ రికార్డు రాష్ట్ర వ్యాప్తంగా వైరల్ అయ్యింది. రైతు మాట్లాడిన మాటలు...'ఆ సారు ఎప్పుడు ఫోన్ చేసినా ఎత్తడం లేదు. ఆఫీసుకు వెళ్లినా కలవటం లేదు. ఇంకో నంబర్ నుంచి ఫోన్ చేస్తే కహానీలు చెప్పి తప్పించుకుంటున్నడు. కనీసం ఫోన్ లేబట్టి... 'పాల బిల్లులు ఫలాన రోజు వరకు వస్తాయి. అప్పటి వరకు మీకేమైన ఆర్థిక సర్దుబాట్లు ఉంటే చూసుకోండి' అని చెబితే బాగుండేది. సమాధానం చెప్పేందుకూ ఇష్టపడటం లేదు. అందుకే ఉన్నతాధికారులతోపాటు జిల్లా అధికారులంతా పొద్దుం దాక(పగటిపూట) ఫోన్లు ఎత్తడం లేదు కాబట్టి రాత్రిపూట ఫోన్లు చేసి వారిని లేపండి. పాల బిల్లులపై సమాధానం చెప్పే వరకు ఫోన్లు చేయండి' అంటూ తోటి రైతులకు పిలుపునిచ్చాడు.

రైతులను అవహేళన చేస్తున్న అధికారులు...

విజయ డెయిరీలోని కొందరు అధికారులు పాడి రైతులను చిన్నచూపు చూస్తూ అవహేళను గురి చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాల బిల్లులు, ఇతర సమస్యలపై ఆఫీసుకు వచ్చిన రైతులను గంటల తరబడి కూర్చోబెట్టి తిప్పి పంపేస్తున్నట్టుగా సమాచారం. ఓ ద్వితీయ స్థాయి అధికారైతే.. మరింత దారుణంగా వ్యవహరిస్తున్నారని తెలిసింది. 'మా వల్లే వాళ్లకు జీతాలు వస్తున్నాయనే విషయం మర్చిపోయి మమ్మల్నే నిర్లక్ష్యం చేస్తున్నారు. వాళ్లంతా అక్కడ ఎవరి కోసం ఉన్నారు. మాకు సమాధానం చెప్పుకుండా ఇంకేం చేస్తరు' అంటూ రైతులు మండిపడుతున్నారు.

70కోట్ల బిల్లులు పెండింగ్!

గతంలో 15 రోజులకోసారి పాల బిల్లులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేవి. ఇప్పుడు నెలలు గడుస్తున్నా.. బిల్లులు పడటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రైతులు ధర్నా చేస్తే ఒక బిల్లు చెల్లించారు. ఇటీవల మరో బిల్లు చెల్లించారు. అయినప్పటికీ ఇంకా మూడు బిల్లులు, సుమారు రూ.70 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్టుగా తెలిసింది. దీంతో దానా, బ్యాంకు రుణాలు ఇతరత్రా అవసరాలకు డబ్బుల్లేక పాడిరైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

లోకం పోకడ



బంగాళాఖాతంలో అల్పపీడనం

- రెండు రోజుల పాటు తెలంగాణకు వర్ష సూచన

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తేతెలంగాణ): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాతావరణ మార్పులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో ఏపీలోని పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.

సింగారంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్‌కు వేసిన తాళాన్ని రైతుతో తీయించిన విద్యుత్తు అధికారులు

ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్‌కు తాళం తీసిన రైతు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి విద్యుత్తు అధికారుల స్పందన

అచ్చంపేట రూరల్, నవంబర్ 14: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సింగారం గ్రామానికి చెందిన రైతు శక్కు నాయక్ తన పంటకు కరెంటు సక్రమంగా అందడం లేదని 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్‌కు బుధవారం తాళం వేశాడు. ఇందుకు సంబంధించి 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో గురువారం వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు విద్యుత్తు అధికారులు స్పందించారు. ఏఈ ఆంజనేయులు, జేఎల్ఎం మూడవత్ నీతారాంనాయక్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి రైతుతో చర్చలు జరిపి తాళం తీయించారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ చేసి మిగతా 17 మంది రైతుల పొలాలకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. ఏఈ ఆంజనేయులును వివరణ కోరగా.. రైతు అనాలోచితంగా చట్టాన్ని అతిక్రమించాడని, ప్రభుత్వం 24 గంటలపాటు విద్యుత్తును అందిస్తున్నదని తెలిపారు.

అదనపు కలెక్టర్ విక్టర్‌కు తమ గోడు వినిపిస్తున్న రైతులు

ఈ అధికారి మాకొద్దు

- పాల్వంచలో రైతుల నిరసన
- తహసీల్దార్‌పై బదిలీవేటు

మాచారెడ్డి, నవంబర్ 14: పని చేయని ఈ తహసీల్దార్ తమకు వద్దంటూ రైతులు ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలిసి ఉన్నతాధికారులు వచ్చి రైతులకు సర్దిచెప్పి తహసీల్దార్‌పై బదిలీవేటు వేశారు. ఈ ఘటన గురువారం కామారెడ్డి జిల్లా పాల్వంచలో చోటు చేసుకుంది. పాల్వంచ తహసీల్దార్ జయంత్‌రెడ్డి ఏడాది నుంచి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా, భూములు రిజిస్ట్రేషన్ చేయకుండా వేధిస్తున్నాడని ఆగ్రహానికి లోనైన రైతులు తహసీల్ ఆఫీస్ ఎదుట ధర్నాకు సిద్ధమయ్యారు. తహసీల్దార్ జయంత్‌రెడ్డి తమకొద్దని పేర్కొంటూ ఆందోళనకు సిద్ధమవుతుండగా.. సమాచారం అందుకున్న అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో రంగనాథ్ హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. రైతులతో మాట్లాడి ధర్నా చేయొద్దని, సమస్యలేమైనా ఉంటే చెప్పాలని కోరారు. ఏడాది కాలంగా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని, భూముల రిజిస్ట్రేషన్లు చేయకుండా వేధిస్తున్నాడని రైతులు తెలిపారు. తమ సమస్యలపై ఆఫీస్‌కు వచ్చి చెప్పుకున్నా స్పందించడం లేదని వాపోయారు. స్పందించిన అదనపు కలెక్టర్ విక్టర్.. తహసీల్దార్ జయంత్‌రెడ్డిని తప్పించి, ఆర్డీవో కార్యాలయంలో పని చేస్తున్న లక్ష్మణ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు జయంత్‌రెడ్డి దీర్ఘకాలిక సెలవు పెట్టినట్టు తెలిసింది.